క్లుప్తంగా

నేడు ప్రభుత్వ భవనాలు ప్రారంభం

వీరపునాయునిపల్లె : మండలంలోని గంగిరెడ్డి పల్లెలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, ఆరోగ్య ఉపకేంద్రం, మినరల్ వాటర్ ప్లాంట్ భవనాలను సోమవారం ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి ప్రారంభించనున్నట్లు మండల అధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొనాలని ఆయన కోరారు.

సమస్యలు తెలుసుకునేందుకే డయల్ యువర్ డీఎం

పులివెందుల రూరల్ : స్థానిక ఆర్టీసి డిపో పరిధిలోని ప్రయాణికుల సమస్యలు తెలుసుకునేందుకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళవారం ఉదయం 10 గంటల నుంచి 11 గంటలవరకు ప్రయాణికులు డయల్ యువర్ డీఎంకు ఫోన్‌చేసి వారి సమస్యలను 9959225780 నెంబర్‌కు తెలపాలన్నారు.

శాంతియుతంగా జీవించండి


ఇళ్లలో సోదాలు చేస్తున్న పోలీసులు

కొండాపురం : గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడకుండా ప్రతి ఒక్కరూ శాంతియుతంగా జీవించాలని ఎస్‌ఐ ఆర్. మోహన్ తెలిపారు. ఆదివారం ఆయన తాళ్ల ప్రొద్దుటూరులోని ఇళ్లను, గడ్డి వాములలో సోదాలు నిర్వహించారు. గ్రామంలో ఎమైనా సమస్యలు ఉంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. చిన్న చిన్న సమస్య వల్ల గొడవలు పడకుండా శాంతియుతంగా పరిష్కరించుకోవాలన్నారు. పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

హైంధవ చైతన్య వేదిక

సింహాద్రిపురం : మండలంలోని బి.చెర్లోపల్లెలో ఆదివారం హైంధవ చైతన్య వేదిక ఆధ్వర్యంలో సనాతన ధర్మం మన కర్తవ్యం అనే అంశంపై ప్రజలతో సమావేశం నిర్వహించారు. సనాతన ధర్మ సారధి విధ్వాన్ పసుపులేటి శంకర్, ఆచార్యమూల మల్లికార్జునరెడ్డిలు మాట్లాడుతూ హిందూ ఆచార్య వ్యవహారాలు, సనాతన ధర్మాలు గురించి వేదాలు ఉపనిశితులు, సారాంశంతో పాటు పురాణాలు గురించి వివరించారు. ప్రతి హిందువుసనాతన ధర్మంపై అవగాహన కలిగి ఉండాలన్నారు.

జూదరుల అరెస్టు

ముద్దనూరు : మండలంలోని చిన్నకత్తెరపల్లె గ్రామ శివారులో పేకాట ఆడుతున్న నలుగురు జూదరులను ఆదివారం పోలీసులు అరెస్టు చేసి వారి వద్దనుంచి రూ.30,930 నగదును స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ నరేష్‌బాబు తెలిపారు.

పూర్వవిద్యార్థుల సమ్మేళనం


గురువును సన్మానిస్తున్న పూర్వపు విద్యార్థులు

జమ్మలమడుగు : తమ వద్ద పాఠాలు నేర్చుకున్న శిష్యులు ఎంత ఉన్నత స్థాయిలో ఉంటే అంత ఆనందంగా ఉంటుందని గురువులు తెలిపారు. ఆదివారం స్థానిక పతంగే రామన్న రావు ఉన్నతపాఠశాలలో 2002–2003 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాశాఖాధికారి చౌడయ్య మాట్లాడుతూ తమ వద్ద చదువుకున్న విద్యార్థులు ఉన్నతస్థాయికి చేరుకోవాలని కోరుకుంటామన్నారు. అనంతరం రిటైర్డు ఎంఈఓ గంగిరెడ్డి, రీటైర్డు పీడీ ప్రదీప్‌కుమార్, పీఈటీ ప్రసాద్, జ్యోతిలను పూర్వ విద్యార్థులు సత్కరించారు. కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ రామకోటి యజ్ఞం

గుర్రంకొండ: మండలంలోని ఎల్లుట్ల గ్రామంలో వెలసిన శ్రీసచ్చిదానంద ఆశ్రమంలో శ్రీ గరుడార్యుల శిష్యబృందం ఆధ్వర్యంలో శ్రీ రామకోటి యజ్ఞం ఘనంగా నిర్వహించారు. ఈనెల 16 నుంచి ఆశ్రమంలో శ్రీరామకోటి యజ్ఞం ప్రారంభించారు. నిర్విరామంగా ఏడు రోజుల పాటు ఈకార్యక్రమం నిర్వహించి ఆదివారం ముగించారు. నిత్యం భక్త జనసందోహంతో రామనామ జపాన్ని తారక మంత్రంగా జపిస్తూ భక్తిశ్రద్ధలతో ఈకార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆశ్రమంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

వాల్మీకిపురం: చదువుతో పాటు క్రీడల్లో రాణించినప్పుడే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని స్థానిక సీఐ సురేష్‌కుమార్ అన్నారు. ఆదివారం వాల్మీకిపురం జీవిఎస్ సీఎస్ క్రీడా మైదానంలో దసరా క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు అందజేశారు. ఎస్ నాగేశ్వర్‌రావ్, టోర్నీ నిర్వాహకులు శ్రీధర్‌కుమార్, ఖాదర్‌బాషా, భరత్, షాహిద్, రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జయ..జయహే... మహిషాసుర మర్ధిని


పులివెందుల : మహిషాసురమర్ధిని అలంకణలో అమ్మవారు


జమ్మలమడుగు : మహిషాసుర మర్ధిని అలంకరణలో రాజరాజేశ్వరిదేవి


ఎర్రగుంట్ల : మహిషాసురమర్ధిని అలంకరణలో అమ్మవారు

పులివెందుల టౌన్ : దుష్టసంహారిని మహిషాసురమర్ధిని కరుణించి కాపాడమ్మా అంటూ భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని ఆరాధించారు. దేవి శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఆలయాలలో ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం 8వ రోజు అమ్మవారు దుష్టసంహారిని మహిషాసురమర్ధిని అలంకారంలో భక్తులకు దర్శన మిచ్చారు. ఉదయం ప్రాతఃకాల పూజ, దుర్గా హోమం నిర్వహించారు. అమ్మవారిశాలలో దున్నపోతు రూపంలో ఉన్న మహిషాసురుని అమ్మవారు వదించేతీరును కళ్లకు కట్టిన ట్లుగా నిర్వహించారు.

పులివెందుల రూరల్ : నల్లపురెడ్డిపల్లెలోని సుంకులమ్మపేటలో పరమేశ్వరి అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : స్థానిక సాయిబాబా ఆలయ ప్రాంగణంలోని రాజరాజేశ్వరిదేవి మహిషాసుర మర్ధిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆదివారం పట్టణంలోని ప్రముఖ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

జమ్మలమడుగు రూరల్ : సకాలంలో వర్షాలు కురిసి రైతులు, ప్రజలు సుభిక్షంగా ఉండాలని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మూలే సుధీర్‌రెడ్డి అన్నారు. దశరా నవరాత్రుల ఉత్సవంగాలో భాగంగా ఆదివారం రాత్రి పట్టణంలోని అంబాభవాని, కన్యకపరమేశ్వరి ఆలయాలను దర్శించి ప్రత్యేక పూజలను చేశారు. కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : పట్టణంలోని కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో మహిషాసురమర్ధిని అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డిలు ఆలయంలో అమ్మవారిని దర్శించుకున్నారు.

వల్లూరులో..

వల్లూరు : స్థానిక శ్రీవాసవీ ఆర్య వైశ్య కల్యాణ భవనంలో వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి ఆదివారం మహిషాసుర మర్ధిని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి ఎదుట చెక్కతో చేసిన (మహిషాన్ని) దున్నను వధించి శాంతి పూజలను నిర్వహించారు. దుగ్గాయపల్లె, వెంకటాపురం వీవర్స్ కాలనీల్లోని శ్రీ చౌడేశ్వరీ దేవి ఆలయాల్లో విశేష పూజలను నిర్వహించారు.

చింతకొమ్మదిన్నెలో..

చింతకొమ్మదిన్నె : మండలంలోని కొత్తపేట–బుగ్గలేటిపల్లె సమీపంలోని గంగమ్మతల్లి ఆలయంలో ఆదివారం నవదుర్గాదేవి అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు తరలివచ్చారు.

చెన్నూరులో..

చెన్నూరు : స్థానిక రామలింగ చౌడేశ్వరిదేవి ఆలయంలో మహిషాసుర మర్ధిని అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. వివిధ ఆలయాల్లో భక్తులు అమ్మవార్లను దర్శించుకునేందుకు మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

కమలాపురంలో..

కమలాపురం : పట్టణంలోని అమ్మవారిశాలలో ఎనిమిదవ రోజు ఆదివారం వాసవీమాత శ్రీ దుర్గాదేవి (మహిషాసుర మర్ధిని) అలంకారంలో దర్శనమిచ్చారు. ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.


వల్లూరు : మహిషాసుర మర్ధిని అలంకారంలో అమ్మవారు


సీకేదిన్నెలో నవదుర్గాదేవి అలంకరణలో గంగమ్మతల్లి


చెన్నూరులో మహిషాసుర మర్ధిని అలంకరణలో అమ్మవారు


వేంపల్లెలో వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో మహిషాసుర మర్ధిని అలంకరణలో అమ్మవారు


జమ్మలమడుగులోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

పులివెందుల టౌన్ : దసరా ఉత్సవాలలో భాగంగా విజయ దశమిని పురస్కరించుకుని ఆదివారం శిల్పా రామంలో ఏర్పాటు చేసిన దసరా సంబరాలను మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ ప్రారంభించారు. డ్యాన్స్ మాస్టర్ రాజా, రాజా కళానిలయం చిన్నారుల జానపదం, వెస్ట్రన్ నృత్యప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నారు. దుర్గాదేవి వేషదారణలో చిన్నారుల నృత్యాలు ఆకర్షించాయి. కార్యక్రమంలో శిల్పారామం పరిపాలనాధికారి సుధాకర్ పాల్గొన్నారు.


శాస్త్రీయనృత్యంలో ఆకట్టుకున్న చిన్నారులు


జానపద నృత్యంలో చిన్నారులు

ఆర్గానిక్ పద్ధతిలో డ్రాగన్ సాగు

– ఉద్యానవన పంటలపై రైతులు ఆసక్తి


ఏపుగా పెరిగిన కాయలను చూపిస్తున్న రైతు రవికుమార్

పులివెందుల రూరల్ : ఆరోగ్య ప్రధాయినిగా పేరుగాంచిన డ్రాగన్ ఫ్రూట్ ఆర్గానిక్ పద్ధతిలో సాగుచేస్తూ సిరులు కురిపిస్తున్నాడు. ప్రస్తుత కాలంలో ఉద్యానవన పంటలపై రైతులు ఆసక్తి కనపరుస్తున్నారు. ఇందులో భాగంగా పులివెందుల, లింగాల మండలాల్లోని రైతులు ఎటుంవటి రసాయన ఎరువులు వాడకుండా ఆర్గానిక్ పంటలను సాగుచేస్తున్నారు. నాణ్యమైన అధిక దిగుబడులు సాధిస్తూ మంచి లాభాలు ఆర్జిస్తున్నారు. లింగాల మండలం అక్కులుగారిపల్లె గ్రామానికి చెందిన రైతు రవికుమార్‌రెడ్డి తనకున్న ఒకటిన్నర ఎకరా పొలంలో 4వేల డ్రాగన్ ఫ్రూట్స్ మొక్కలను గుజరాత్ రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి ఒక్కో మొక్క రూ.100లకు కొనుగోలు చేసి డ్రాగన్ ఫ్రూట్ పంటకు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం మార్కెట్‌లో డ్రాగన్ ఫ్రూట్స్‌కు మంచి గిరాకీ ఉండడం వల్ల మంచి లాభాలు వస్తున్నాయని రైతు అంటున్నారు.

ఒకటిన్నర ఎకరా డ్రాగన్ మొక్కలు సాగుచేయడానికి రూ.8 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఖర్చు అవుతోంది. డ్రాగన్ ఫ్రూట్స్ మార్కెట్‌లో రూ.120ల నుంచి రూ.200ల వరకు ధర పలుకుతోంది. ఇక్కడ పండించిన పంటను తిరుపతి, హైదరాబాదు, కర్నూలు, అనంతపురం, కడప ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. జూన్ నెల నుంచి నవంబర్ నెల వరకు డ్రాగన్ పంట కాపుకొస్తుంది. నర్సరీ సదుపాయం కూడా కల్పించి కావాల్సిన రైతులకు రెండు అడుగుల మొక్క రూ.100లతో విక్రయిస్తామన్నారు.

ఆరోగ్య ప్రధాయినిగా డ్రాగన్ ఫ్రూట్స్

ప్రస్తుతం మార్కెట్‌లో ఆరోగ్య ప్రదాయినిగా డ్రాగన్‌ఫ్రూట్స్ ఎంతో పేరుగాంచింది. షుగర్, బీపీ, మలబద్ధకం, కొల్రస్టాల్ వ్యాధులకు డ్రాగన్ ఫ్రూట్స్ ఎంతో ఉపయోగపడుతుంది. ఆర్గానిక్ పద్ధతిలో పంట సాగుచేయడం వల్ల మంచి దిగుబడి రావడంతో పాటు కాయలు కూడా తియ్యగా ఉన్నాయి. ఇతర మార్కెట్‌లలో డ్రాగన్ ఫ్రూట్స్‌కు మంచి గిరాకీ ఉంది. ప్రస్తుతం రైతులు కూడా డ్రాగన్ ఫ్రూట్స్ పంటను సాగుచేసేందుకు ఆసక్తి కనపరుస్తున్నారు.

వర్షం కోసం బోనాలు

రాజుపాళెం : వర్షం కురవాలని మండలంలోని సోమాపురం గ్రామస్తులు ఆదివారం గ్రామ పొలిమేర వద్ద ఉన్న గంగమ్మకు బోనాలు, పూజలు చేశారు. గ్రామస్తులంతా కలిసి ఈ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అలాగే గ్రామంలో పెద్దమ్మ, రామాలయం, శివాలయంలోని స్వాములకు 101 బిందెలతో జలాభిషేకం చేసి దగ్గరలోని బరకలలో వెలసిన గంగమ్మకు 101 బిందెల నీటితో అభిషేకం చేశారు.